క్లుప్తంగా

కాళీమాతకు ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న కమిటీ సభ్యులు

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని కాళీనగర్‌లో కాళీమాత పూజలు ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో 24గంటల ఉపవాస దీక్ష చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు బోడ ధర్మేందర్, రీనారాణి దాస్, సూరజ్ మాలో, కాశీనాథ్ చటర్జీ, హర్షసేకర్, ధనుంజయ సర్కార్, సంతోష్ మాలో తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన నాగపురి ప్రకాశ్ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. సోమవారం ఆయన కథనం ప్రకారం.. ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో బెల్టు షాపులపై దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ప్రకాశ్ నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపు నిర్వహిస్తున్నట్లు, అందిన సమాచారం మేరకు అతడి షాపుపై దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు'

బెల్లంపల్లి: కాంగ్రెస్ పార్టీకి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై ఆరోపణలు చేయడం సరికాదని బీఆర్ఎస్ అనుబంధ మైనార్టీ సంఘం బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు ఎజాజ్, ప్రధాన కార్యదర్శి ఖలీల్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు వాజిద్ ఒక ప్రకటనలో తెలిపారు. కబ్రస్థాన్‌ను ఎమ్మెల్యే కబ్జా చేయడానికి యత్నించారని చేసిన ఆరోపణలో వాస్తవం లేదని తెలిపారు. ఎన్నికల వేళ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఆ ప్రచారాన్ని ముస్లిం మైనార్టీలు, ప్రజలు నమ్మొద్దని కోరారు. కాంగ్రెస్ ముస్లిం మైనార్టీ నాయకులు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

'కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుద్దాం'



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్ నేత

జన్నారం: వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని బలోపేతం చేయడానికి విద్యార్థి లోకం ముందుకు రావాలని తెలంగాణ నేతకానీ విద్యార్థి మహార్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్సీటీ సంస్థ చైర్మన్ సాయిని ప్రసాద్ నేత అన్నారు. జన్నారంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధితో పాటు, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించడంలో సీఎం కేసీఆర్ కృషి మరిచిపోలేదన్నారు. అలాంటి నాయకత్వాన్ని బలోపేతం చేయడానికి విద్యార్థి లోకం, యువకులు ముందుకు రావాలన్నారు. తెలంగాణ నేతకానీ మహార్ విద్యార్థి సంఘం ఖానాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్‌కు పూర్తి మద్దతుగా నిలిచి గెలుపునకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో సంఘ నాయకులు వెంకటేశ్, నర్సగౌడ్, ముజ్జన్న, వినోద్, రవి, వికాస్‌రాజ్, లోయాజ్, వంశీ, హరీష్, బన్ని, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



దీపావళి సంబురం..!

దండేపల్లి/చెన్నూర్‌రూరల్/మందమర్రిరూరల్/జైపూర్/లక్సెట్టిపేట/జన్నారం/భీమారం/నెన్నెల/భీమిని/చెన్నూర్/కాసిపేట/బెల్లంపల్లి/మంచిర్యాలఅర్బన్: జిల్లా వ్యాప్తంగా దీపావళి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. సమీప గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేసి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్యాపారులు దుకాణాల్లో లక్ష్మీపూజలు చేశారు. మరికొందరు ఇళ్లలో శ్రీ కేదారీశ్వర వ్రతాలు నోముకున్నారు. ఇళ్లను మట్టి దీపాలు, విద్యుత్ దీపాలతో ప్రజలు అందంగా అలంకరించారు. తీపి వంటకాలు చేసి నైవేద్యంగా సమర్పించారు. పిల్లలు, పెద్దలు టపాసులు కాల్చి సంతోషంగా గడిపారు. చెన్నూర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా స్వగృహంలో నిర్వహించిన లక్ష్మీ పూజలో ఎమ్మెల్యే బాల్క సుమన్ పాల్గొన్నారు. మందమర్రిలో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి కుటుంబ సభ్యులతో టపాకాయలు కాలుస్తూ సందడి చేశారు.



మంచిర్యాల పట్టణంలో...



పూజలు నిర్వహిస్తున్న వ్యాపారులు



చెన్నూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ స్వగృహంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే



జైపూర్ మండలం ముదిగుంటలో..



ఆస్నాదలో కేదారీశ్వర వ్రతం నోముకుంటూ..



బెల్లంపల్లిలో....



మంచిర్యాలలో టపాసులు కాల్చుతూ...



నెన్నెలలో...



జైపూర్:కాకర్లు కాలుస్తున్న మహిళలు



టపాసులు కాలుస్తున్న చిన్నారులు



భీమారంలోని లక్ష్మీదేవాలయంలో....



దండేపల్లి: దుకాణంలో లక్ష్మీ పూజలు



చర్లపల్లి గ్రామంలో లక్ష్మీపూజలో దంపతులు

కార్తీకం.. ఆధ్యాత్మికం

- ప్రారంభమైన కార్తీకమాసం
- నెల రోజులపాటు ప్రత్యేక పూజలు

మంచిర్యాలఅర్బన్/కెరమెరి: కార్తీక మాసం అంటే ఆధ్యాత్మికం వెల్లివిరిసే నెల. దీపావళి మరునాడు వచ్చే కార్తీక మాసం ఈఏడాది రెండోరోజు నుంచి ప్రారంభమవుతుంది. కార్తీక మాసంలో సోమవారాలకు ఎంతో విశిష్టత ఉంది. పరమేశ్వరుడు, విష్ణుమూర్తులకు ప్రీతిపాత్రమైన మాసంగా కార్తీక మాసాన్ని పరిగణిస్తుంటారు. ఈమాసంలో శివకేశవులను పూజిస్తే పుణ్యఫలాలతో పాటు ముక్తి ప్రాప్తిస్తుందని నమ్ముతారు. శివుడిని అంతఃకరణ శుద్ధితో ప్రార్థించి లింగాభిషేకం చేస్తే భక్తుల అభీష్టాలు నెరవేరుతాయని పురోహితులు చెబుతుంటారు. మంగళవారం నుంచి కార్తీక మాసం ప్రారంభం కానుండటంతో జిల్లాల్లోని ఆలయాలు ముస్తాబయ్యాయి.

ప్రతీరోజు పర్వదినమే..

కార్తీక మాసంలో ప్రతీరోజు పర్వదినమే. ఈ పుణ్యమాసంలో కార్తీక సోమవారాలు అత్యంత పవిత్రమైనవిగా శివపురాణం తెలియజేస్తోంది. సోమవారం శివరాధన చేయడం, ఈశ్వరుడిని పంచామృతంతో అభిషేకించడం, ఉపవాసం ఆచరించడం, నదీ స్నానం చేసి దీపారాధన చేయడంతో హరిహరుల అనుగ్రహం కలుగుతుందని కార్తీక పురాణం చెబుతుంది. భగినీ హస్తభోజనం, నాగపంచమి, ఉత్థాన ఏకాదశి, క్షీరాబ్ది ద్వాదశి, జ్వాలాతోరణం దర్శనం చేసుకోవడంతో సర్వపాపాలు ప్రక్షాళనమవుతాయి. కార్తీక పౌర్ణమి నాడు భక్తులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తుంటారు.

నదీ స్నానాలు..

కార్తీక మాసంలో నదీ స్నానం, దీపం వెలిగించడం, ఉపవాసాలు, వనభోజనాలు ముఖ్యమైనవి. సూర్యుడు ఉదయించకముందే కార్తీక స్నానం చేయడం వల్ల ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలు దూరమై మానసిక ఆహ్లాదం కలుగుతుంది. కార్తీక మాసంలో వెలిగించే దీపానికి చాలా ప్రాముఖ్యత ఉంది. కార్తీక మాసంలో నువ్వుల నూనె నెయ్యితో పెట్టిన దీపం నుంచి వచ్చిన పొగ పీల్చటం వల్ల అనారోగ్య సమస్యలు దూరమవుతాయి. ఉదయం, సాయంత్రం గృహం, పూజా మందిరం, తులసి సన్నిధి, ఆలయంలో దీపారాధన చేయడంతో సకల సౌఖ్యాలు కలుగుతాయి.

ఆలయాల్లో పూజలు..

దీపావళి మరుసటిరోజు సోమవారం కావడంతో మంచిర్యాలలోని విశ్వనాథ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో భక్తులు దీపాలు వెలిగించారు. ద్విచక్రవాహనాలకు పూజలు నిర్వహించారు.



పూజలు చేస్తున్న భక్తులు

ప్రతీరోజు మహిమాన్వితం..



కార్తీక మాసంలో ప్రతీరోజు మహిమాన్వితమైనది. హరిహరులకు అత్యంత ప్రీతిపాత్రమైన మాసం ఇది. శివునికి పూజలు చేయడం వల్ల సర్వపాపాలు హరిస్తాయి. విశ్వనాథస్వామి ఆలయంలో ప్రతీరోజు వేంకటేశ్వరస్వామికి అర్చనలు, రుద్రాభిషేకం నిర్వహిస్తాం.

– భట్టాచార్యులు, అర్చకుడు

ఉపవాసం దివ్యౌషధం..



మహిళలు ఎంత ఎదిగినా సంప్రదాయాలు మరువకూడదు. మన సంప్రదాయాన్ని పిల్లలు తెలుసుకునేందుకు కార్తీక మాసం వేదికగా మారుతుంది. పౌర్ణమి నాడు ఉపవాసం ఉంటే నెలంతా ఉన్న ఫలితం లభిస్తుందని నమ్మకం. దంపతులు ఉపవాసం ఉంటే ఇంకా మంచిది.

– ఆదే రుక్మాబాయి, గోపాల్‌వాడ



కెరమెరి: భజనల్లో లీనమైన భక్తులు

ఆదరించండి.. అండగా ఉంటా

- బెల్లంపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిన్నయ్య



కొత్తపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

భీమిని: కన్నెపల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సోమవారం బెల్లంపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య ప్రజలతో మాట్లాడారు. తమకు ఓటు వేసి ఆదరించాలని, ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. గ్రామాల్లోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని సానుకూలంగా సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి

నెన్నెల: తనకు మరోసారి అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని బెల్లంపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య అన్నారు. నెన్నెల కొత్తగూడెం నేతకానీ కులస్తులతో సోమవారం మాట్లాడారు. నేను నెన్నెల బిడ్డనని, మీ కులస్తుడినని మీరందరూ కలిసి ఆశీర్వదిస్తేనే హాట్రిక్ ఎమ్మెల్యేగా గెలుపొందుతానన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చే వారిని నమ్మి మోసపోయి గోసపడొద్దన్నారు. రాష్ట్రంలోనే నేతకానీ కులానికి చెందిన ఎమ్మెల్యేను నేను ఒక్కడినే ఉన్నానని, మన కుల గౌరవం కోసం ఆలోచించి మళ్లీ కారు గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఎలాంటి అపాయింట్‌మెంట్ లేకుండా నేరుగా బెల్లంపల్లిలో తనను కలిసి మాట్లాడవచ్చన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా, తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల కో ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, ఎంపీటీసీ తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు తోట మధు, దుర్గం మల్లేష్‌లు ఉన్నారు.

'పేదల ఆశల సౌధం కేసీఆర్'

- ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్



ఘన స్వాగతం పలుకుతున్న కాలనీవాసులు

ఖానాపూర్: ఇల్లులేని పేదల ఆశల సౌధం సీఎం కేసీఆర్ అని ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్దకు వెళ్లగా.. కాలనీవాసులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యేగా గెలిచాక పేదలకు ఇల్లు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

జన్నారం: బీఆర్ఎస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్‌లు అన్నారు. సోమవారం జన్నారం మండలంలోని పొనకల్, జన్నారం, లింగయ్యపల్లి, జువ్విగూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే రూ. 400లకే సిలిండర్, రేషన్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ రూ. 5 లక్షల బీమా చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పొనకల్ ఉప సర్పంచ్ శ్రీనివాసగౌడ్, భరత్‌కుమార్, రాజేశ్వర్, శంకర్, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

నేతలారా.. సమస్యలు తీర్చండి

- విద్య, ఉపాధి, తాగునీరు, సాగునీరు లేక ప్రజలు సతమతం

చెన్నూర్: నియోజకవర్గంలో విద్య, ఉపాధి, తాగు, సాగునీటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలు పునరుద్ధరణ పూర్తి కాకపోవడంతో పాటు పీజీ కళాశాల లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నతరహా పరిశ్రమలు లేక ఉపాధి కోసం పట్టణాలకు పరుగులు పెట్టాల్సిన దుస్థితి, తలపునే నీరు పెట్టుకొని చేప నీటికోసం వేతికినట్లు ఉంది నియోజకవర్గ ప్రజల పరిస్థితి. చుట్టూ గోదావరి, ప్రాణహిత నదులున్నా, ఎత్తిపోతల పథకాలు లేక రైతులు సాగునీటికి తండ్లాడుతున్నారు. మిషన్ భగీరథ పనులు పూర్తి కాకపోవడంతో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు రాజ్యమేలుతున్నా, పట్టించుకునే నాథుడే కరువయ్యారు. నేతలారా మా సమస్యలు తీర్చండి.. అని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి అవకాశాలు కరువు..

చెన్నూర్ నియోజకవర్గంలో చిన్నతరహా పరిశ్రమలు లేకపోవడంతో యువత ఉపాధి కోసం వెంపర్లాడుతున్నారు. పీజీలు, డిగ్రీలు చేసిన కొందరు యువకులు ప్రైవేట్ షాపుల్లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మరికొందరు పొట్టచేత పట్టుకొని ఉపాధి కోసం పట్టణాలకు వెళ్తున్నారు. మందమర్రి మున్సిపాలిటీలో గల లెదర్ ఫ్యాక్టరీ ప్రారంభిస్తే సుమారు 1000 మంది యువతకు ఉపాధి లభిస్తుంది. అంతే కాకుండా చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలో చిన్నతరహా పరిశ్రమ ఏర్పాటు చేస్తే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

పాఠశాలల పునరుద్ధరణ, పీజీ కళాశాల ఏర్పాటు..

నియోజకవర్గంలో విద్యారంగాభివృద్ధిలో భాగంగా పాఠశాలల పునరుద్ధరణ పనులు పూర్తి కాకపోవడంతో పాఠశాలలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పీజీ కళాశాల లేకపోవడంతో డిగ్రీ చదువుకున్న పేద విద్యార్థులు పీజీ కోసం పట్టణాలకు వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. ఈ మేరకు నేతలు దృష్టి సారించాలి.



మందమర్రిలో మూసి ఉన్న లెదర్ పార్క్

సాగునీటి పథకాలు లేక..

నియోజకవర్గం వ్యవసాయ ఆధారిత ప్రాంతం. చుట్టూ గోదావరి, ప్రాణహిత నదులు పారుతున్నా పంట చేన్లకు సాగునీరు కరువైంది. ఎత్తిపోతల పథకాలు లేక వర్షాధార, బోర్ల పై ఆధారపడి రైతులు పంటలు సాగు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఎత్తిపోతల పథకాలు నిర్మించి సాగునీరందించాలని రైతులు కోరుతున్నారు.

తాగునీటి కోసం..

నియోజకవర్గంలో తాగునీటి సమస్య ఉంది. మిషన్ భగీరథ పనులు పూర్తి కాలేదు. నేటికీ పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛజలం అందడం లేదు. ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ పనులు త్వరితగతిన పూర్తి చేయించి ఇంటింటికీ తాగునీటి సౌకర్యం కల్పించాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

అధ్యక్షుడిగా సుదర్శన్ గౌడ్

మందమర్రిరూరల్: క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా ఆ పార్టీ సీనియర్ నాయకులు, కో ఆప్షన్ సభ్యులు మాజీ జెడ్పీటీసీ కంబగోని సుదర్శన్ గౌడ్‌ను, యువజన విభాగం అధ్యక్షుడిగా దాసరి రాకేష్‌ను సోమవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ నియమించారు.